నేటి దినపత్రిక
సూర్య
18వ వసంతంలోకి
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
మంగళవారం | 22 ఏప్రిల్ 2025 | పేజీలు 8

# సమర్థవంతమైన అధికారి సూర్యతేజ

నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

2లో..



భూ సమస్యల పరిష్కారంలో

## నిర్లక్ష్యంగా ఉంటే ఊరుకోను

**నిర్దిష్ట గడువులోగా రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలి**
**అధికారులను హెచ్చరించిన జిల్లా కలెక్టర్ ఆనంద్**



*నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :*

భూ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఒ.ఆనంద్ అధికారులను హెచ్చరించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో కలెక్టర్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డీఆర్వో ఉదయభాస్కర్ రావు, డీపీఓ శ్రీధర్‌రెడ్డి, జడ్పీ సీఈవో విద్యారమ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వివిధ సమస్యలపై ప్రజలు అందించిన అర్జీలను జాప్యం లేకుండా వెంటనే పరిష్కరించేందుకు ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా భూ సమస్యలు, ఇతర రెవెన్యూ అంశాలకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని, వాటిని పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీల పరిష్కారంపై

-మిగతా 2లో



## నగర మేయర్‌పై..
# అవిశ్వాసం లేనట్లే !

- నిర్ణయం తీసుకున్న మంత్రి నారాయణ, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి
- అనేక అంశాలను పరిగణలోకి తీసుకున్న ఇరువురు నేతలు

*నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :*



రాష్ట్రంలోని అనేక కార్పొరేషన్లలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మేయర్‌కు సంబంధించి తెలుగుదేశం పార్టీ అవిశ్వాస తీర్మానాలు ప్రవేశపెడుతున్న సంగతి తెలిసిందే. దీనికి సంబంధించి నెల్లూరు జిల్లా కేంద్రంలో కూడా నగర కార్పొరేషన్ మేయర్ పొట్లూరి స్రవంతిపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టే అంశంపై రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి రెండు రోజుల క్రితం ప్రత్యేకంగా భేటీ అయ్యారు. నెల్లూరు జిల్లా కేంద్రంలో వివిధ అభివృద్ధి కార్యక్ర మాలతో పాటు ఈ అంశం కూడా ప్రస్తావనకు వచ్చింది. మేయర్‌పై అవిశ్వాస తీర్మానానికి సంబంధించి ఇరువురు నేతల మధ్య సుదీర్ఘంగా చర్చ సాగింది. ఇప్పటికే నెల్లూరు నగర మేయర్ పొట్లూరి స్రవంతి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి దూరంగా ఉందని, ఇలాంటి పరిస్థితుల్లో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడం సమంజసంగా ఉండదని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మంత్రి నారాయణ దృష్టికి తీసుకుని వచ్చారు. ఇలాంటి సమయంలో అవిశ్వాస తీర్మాన నోటీసుకు ముందుకెళ్లడం వద్దని ఆయన పేర్కొన్నట్లు అత్యంత విశ్వసనీయ వర్గాల సమాచారం. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి ఆలోచన.. సెంటిమెంట్ కూడా మరోరకంగా ఉంది. ఎలాంటి రాజకీయ నేపథ్యంలోని మేయర్ స్రవంతిని తీసుకొని వచ్చి నగర మేయర్‌గా కోటంరెడ్డి రాజకీయ భిక్ష పెట్టారు. తాను స్వయంగా పెట్టిన మేయర్‌పై అవిశ్వాస

-మిగతా 2లో

మే 1న ఆత్మకూరులో

# సీఎం పర్యటన



- త్వరలో అధికారికంగా ఖరారు కానున్న పర్యటన వివరాలు
- మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి వెల్లడి
- అధికారులు సంసిద్ధంగా ఉండాలి : మంత్రి ఆనం ఆదేశం

*ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :*

మే 1వ తేదీన సీఎం చంద్రబాబు నాయుడు ఆత్మకూరులో పర్యటించనున్నట్లు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. ఇప్పటికే సీఎం కార్యాలయం నుంచి తనకు ప్రాథమికంగా సమాచారం అందిందని, త్వరలోనే అధికారికంగా ఖరారు కావాల్సి ఉందని మంత్రి చెప్పారు. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం నెల్లూరులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో సీఎం పర్యటనకు ముందస్తుగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి అధికా రులతో ప్రాథమికంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మేనెలా ఒకటిన ఆత్మకూరు సమీప గ్రామంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం, నారంపేట వద్ద ఎమ్ ఎస్ ఎమ్ ఈ పార్కు ప్రారంభోత్సవం, పార్టీ కార్యకర్తలతో సమావేశంలో సీఎం పాల్గొంటారని ప్రాథమికంగా సమాచారం అందినట్టు మంత్రి చెప్పారు. సీఎం పర్యటనకు సంబంధించి అనువైన ప్రాంతాన్ని

-మిగతా 2లో

ఎమ్మెల్యే కాకర్ల సురేష్

# నిఘా నేత్రం

- అక్రమ మైనింగ్‌పై ఉక్కుపాదం !
- అక్రమ మైనింగ్ వాహనాలను వెంబడించి పట్టుకున్న ఎమ్మెల్యే
- రెవెన్యూ అధికారులకు అప్పగింత

*వింజమూరు, మేజర్‌న్యూస్ :*

నిఘా నేత్రంతో అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న వాహనాలను వెంబడించి పట్టుకున్న సంఘటన వింజమూరు మండలం నల్లగొండ గ్రామంలో చోటు చేసుకుంది. **వివరాల్లోకి వెళ్తే..** వింజమూరు మండలం నల్లగొండ్ల గ్రామ సమీపంలో ఉన్న నల్లకొండ వద్ద గత కొద్ది రోజులు నుండి అక్రమంగా గ్రావెల్ తరలించి డంపింగ్ చేసుకుంటున్నారు. ఈ విషయం ఎమ్మెల్యే దృష్టికి రెండు రోజుల క్రితం వచ్చింది. బిజీ షెడ్యూల్లో ఉన్న ఎమ్మెల్యే..

-మిగతా 2లో



అక్రమ కేసులను పెట్టడమే

# టీడీపీ లక్ష్యం

ఉదయగిరి వైసీపీ సమన్వయకర్త రాజగోపాల్‌రెడ్డి

02లో



రాములోరి కళ్యాణోత్సవంలో..

## ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి

**భక్తి శ్రద్ధలతో స్వామి దర్శనం చేసుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించిన ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి**

ఇందుకూరుపేట మండలం రాముడు పాళెం గ్రామ పరిధిలోని ఎర్రంకి దిబ్బ రామాలయంలో శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కళ్యాణోత్సవంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది.

8లో

# విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం

## జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ వెల్లడి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లాలోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాలులో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 119 ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి, పరిష్కరించాలని పోలీసు అధికారులకు సూచించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాదిదారులతో జిల్లా ఎస్పీ మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి మొత్తం 119 ఫిర్యాదులు వచ్చాయన్నారు. రాపూరు పరిధికి చెందిన వ్యక్తిని, తెలంగాణ, గోదావరి ఖనికి చెందిన శ్వేత అనే మహిళ ప్రభుత్వ శాఖలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి, 4.85 లక్షల నగదు తీసుకొని మోసం చేసిందని, అదేవిధంగా నెల్లూరు రూరల్ పరిధికి చెందిన వ్యక్తిని నెల్లూరుకు చెందిన విజయభాస్కర్ రెడ్డి అనే వ్యక్తి సాఫ్ట్వేర్ జాబ్ ఇప్పిస్తానని నమ్మించి 84 వేల నగదు తీసుకొని మోసం చేసాడని, విచారించి న్యాయం చేయాలని కోరారు. తెలంగాణ, మిర్యాలగూడకు చెందిన వ్యక్తిని, కావలికి చెందిన దేవరకొండ కిషోర్ అనే వ్యక్తి, అతని అనుచరులు తక్కువ ధరకు బంగారం ఇప్పిస్తానని నమ్మించి 40.90 లక్షలు నగదు తీసుకొని మోసం చేసాడని, అడిగితే చంపుతానని బెదిరిస్తున్నారని, విచారించి న్యాయం చేయాలని కోరారు. ప్రకాశం జిల్లా పరిధికి చెందిన వ్యక్తి, తన కుమార్తెను చిన్న బజార్ పరిధిలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుందని, తన మరణానికి తన అల్లుడు, అత్త, మేనమామ కారణమని, లోతుగా దర్యాప్తు చేసి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అల్లూరు పరిధికి చెందిన వ్యక్తిని, అదే గ్రామానికి చెందిన శీనయ్య మరి కొందరు పాత కక్ష్యలు మనసులో పెట్టుకొని కొట్టి గాయపరిచారని, విచారించి న్యాయం చేయాలని కోరారు. కలిగిరి పరిధికి చెందిన వృద్ధురాలిని తన కొడుకు, కోడలు తన పేరు మీద ఉన్న ఆస్థిని నాకు తెలియకుండా వారి పేరు మీద మార్చుకొని, ఇంటి నుండి తరిమేశారని, అదే విధంగా కావలి 2 టౌన్ పరిధికి చెందిన వృద్ధురాలిని తన రెండవ కొడుకు చూసుకుంటానని నమ్మించి, తన పేరు మీద ఉన్న ఆస్థిని రాయిం చుకొని అమ్మేశాడని, తను డయాలసిస్ పేషెంట్ అని, విచారించి న్యాయం చేయాలని కోరారు. వేదాయపాలెం పరిధికి మహిళను తన భర్త చెడువ్యసనాలకు లోనై వేధిస్తూ, కనీసం పిల్లల బాగోగులు చూసుకోవడం లేదని, కౌన్సెలింగ్ నిర్వహించి కుటుంబాన్ని చక్కదిద్దాలని కోరారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సంధర్భంగా జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ హామీ ఇచ్చారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అడిషనల్ ఏఎస్పీ (అడ్మిన్) సీహెచ్ సౌజన్య, డీటీసీ డీఎస్పీ గిరిధర్, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులు రెడ్డి, ఎస్‌బి 1 సీఐ వెంకటేశ్వరరావు, ఎస్‌బి-2 సీఐ శ్రీనివాసరెడ్డి, కంప్లైంట్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

## సమర్థవంతమైన అధికారి సూర్యతేజ

### నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి




**నెల్లూరు టౌన్, మేజర్‌న్యూస్ :** బదిలీపై వెళ్తున్న నుడా వైస్ చైర్మన్ మల్లవరపు సూర్య తేజ సమర్థవంతమైన అధికారి అని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి అన్నారు. సోమవారం ఇంచార్జ్ నుడా వైస్ చైర్మన్ మల్లవరపు సూర్యతేజ బదిలీ అయిన సందర్భంగా నెల్లూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ కోటంరెడ్డి రెడ్డి శ్రీనివాసులురెడ్డి, అధికారులు ఘనంగా సన్మానించారు. నగర పాలక సంస్థ కమిషనర్, ఇంచార్జ్ నుడా వైస్ చైర్మన్‌గా సూర్యతేజ బాగా పని చేశారన్నారు. నుడా వైస్ చైర్మన్ మల్లవరపు సూర్య బదిలీపై వెళ్లడం బాధాకరంగా ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ మేనేజింగ్ డైరెక్టర్‌గా బదిలీపై వెళుతున్న సూర్యతేజ అక్కడ కూడా బాగా పనిచేసి మంచి పేరు తీసుకురావాలని కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి అన్నారు. కార్యక్రమంలో నెల్లూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఈశ్వర్‌రాజు, కార్యదర్శి పెంచల్ రెడ్డి, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ హిమబిందు, ఇంచార్జ్ ఈఈ మనోహర్ రెడ్డి, ప్లానింగ్ ఆఫీసర్ హిమబిందు, అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్ మురళి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బాలకోటయ్య, అకౌంట్స్ ఆఫీసర్ హేమలత, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## భూ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా ఉంటే ఊరుకోను



(మొదటి పేజీ తరువాయి)

ఆయా శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు.

**అర్జీదారులకు భోజన వసతి ఏర్పాట్లపై విశేష స్పందన**

ప్రతి సోమవారం సుదూర ప్రాంతాల నుంచి కలెక్టరేట్‌కు వస్తున్న అర్జీదారులకు కలెక్టర్ మధ్యాహ్నం భోజన సౌకర్యం కల్పించడం పట్ల విశేష స్పందన లభిస్తోంది. గత మూడు రోజులుగా ఎండ తీవ్రత పెరిగిన దృష్ట్యా సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసిన అర్జీదారులకు మంచినీరు, భోజన సదుపాయాలు ఊరటనిచ్చాయి. దీంతో అర్జీదారులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

## నగర మేయర్‌పై అవిశ్వాసం లేనట్లే..!

(మొదటి పేజీ తరువాయి)

సముఖంగా లేనట్లు సమాచారం. మంత్రి నారాయణ కోటంరెడ్డి ఇద్దరు సుదీర్ఘంగా అర గంట సేపు చర్చించి అనేక అంశాలను పరిగణలోకి తీసుకొని మేయర్‌పై అవిశ్వాస తీర్మానం పెట్ట కూడదని నిర్ణయించుకున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలియజేశాయి. నెల్లూరు జిల్లా కేంద్రంలో రాజకీయాలను శాసిస్తున్న ఇద్దరు నేతల నిర్ణయంతో మేయర్‌పై అవిశ్వాస తీర్మానం కథ కంచికి చేరింది.

## మే 1న ఆత్మకూరులో సీఎం పర్యటన



(మొదటి పేజీ తరువాయి)

హెలిప్యాడ్ కోసం ఎంపిక చేయాలని అధికారులకు సూచించారు. ఆర్ అండ్ బి, రెవెన్యూ, పోలీసు, ఎలక్ట్రికల్, మున్సిపల్ శాఖల అధికారులు సీఎం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను సమన్వయంతో చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. త్వరలో సీఎం పర్యటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఖరారు కానున్నట్లు మంత్రి చెప్పారు. సమావేశంలో ఆత్మకూరు ఆర్డీవో పావని, డీఎస్పీ వేణుగోపాల్, ఆర్ అండ్ బి ఎస్ ఈ గంగాధర్, ఈఈ మురళీకృష్ణ, మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కాకర్ల సురేష్ నిఘా నేత్రం

(మొదటి పేజీ తరువాయి)





ఖాళీ సమయాన్ని చూసుకొని సోమవారం 11 గంటల సమయంలో ఎవరికి సమాచారం ఇవ్వకుండా, నల్లగొండ్ల గ్రామానికి చేరుకున్నారు. అక్కడ సీక్రెట్ ఆపరేషన్ చేసి వాహనాలను వెంబడించి పట్టుకొని ఆ తర్వాత అధికారులకు ఫోన్ చేసి వారిని పిలిపించి వాహనాలను అప్పగించారు. వీరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో కొంతమంది పని కట్టుకొని తన పేరు చెప్పుకుంటూ అక్రమాలకు పాల్పడుతున్నారు. వారికి అధికారులు కూడా సహకరిస్తున్నట్లు సమాచారం.. తాను ఎప్పుడూ ఎవరికీ చెప్పను, ఏదైనా అత్యవసరమైతే నేనే డైరెక్ట్‌గా మాట్లాడుతా.. నేను మాట్లాడితేనే తీసుకోండి, నా పేరు చెప్తే వినకండి.. అని అధికారులకు మాస్ వార్నింగ్ ఇచ్చారు. అలసత్యం ప్రదర్శిస్తూ అక్రమాలకు తావిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వింజమూరు మండలం నల్లగొండ్ల గ్రామంలో ఉప సర్పంచ్, మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ పంచాయతీ తీర్మానం కూడా ఇస్తామని చెప్పి.. మరి అక్రమ గ్రావెల్ తవ్వకానికి పాల్పడ్డారన్నారు. వీరిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలియజేసినట్లు తెలిపారు. వీరి సొంత లాభానికి తనకు మాట తెస్తున్నారని, దీనిని ఎట్టి పరిస్థితుల్లో సహించబోనని తెలిపారు. ఉదయగిరిని మైనింగ్ మాఫియా విడిచి వెళ్లాలని, లేదంటే వెంబడిస్తానని హెచ్చరించారు. నియోజకవర్గ ప్రజలు కూడా మన విలువైన సంపదను మనమే కాపాడుకోవాలని, అన్ని చోట్లకు తాను రాలేనని, గ్రామస్థాయిలోనే అరికట్టాలని పిలుపునిచ్చారు. అవసరమైన సమయంలో తనకు సమాచారం అందించాలని తెలిపారు. అధికారులు కూడా అప్రమత్తంగా ఉంటూ, ఇటువంటి వాటికి తావు లేకుండా చూడాలని హితవు పలికారు. ఆయన వెంట తహసిల్దార్ ఎస్కే హమీద్, వీఆర్‌ఓ నరసింహారెడ్డి, కలిగిరి సీఐ వెంకటనారాయణ, గ్రామస్తులు రోశయ్య, తిరుపాలరెడ్డి తదితరులున్నారు.

## అక్రమ కేసులను పెట్టడమే టీడీపీ లక్ష్యం

### ఉదయగిరి వైసీపీ సమన్వయకర్త రాజగోపాల్ రెడ్డి వెల్లడి




**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** కూటమి ప్రభుత్వం వచ్చాక పాలన మానేసి వైసీపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టడమే లక్ష్యంగా పెట్టుకుందని ఉదయగిరి నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం నెల్లూరు జిల్లా వైఎస్‌ఆర్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లా పార్టీ అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డిపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారని తెలిపారు. కూటమి నేతలు తమ పలుకుబడిని ఉపయోగించి కోర్టులో బెయిల్ కూడా రాకుండా అడ్డుపడుతున్నారని ఆరోపించారు. కాకాణి గోవర్ధన్ రెడ్డి రైతుల సమస్యలపై, ఫీజు రీఎంబర్స్‌మెంట్, ఇతర ప్రజా సమస్యలపై బలంగా తన గొంతు వినిపిస్తున్నాడని, ఆయనపై అక్రమ కేసులు పెట్టడం జరిగిందని తెలిపారు. ఇదేవిధంగా ప్రతి ఒక్కరు గొంతు నొక్కాలని కూటమి నాయకులు పనిగా పెట్టుకున్నారని, ఇది సరైన పద్ధతి కాదన్నారు. మేకపాటి రాజమోహన్ రెడ్డి మొదటిసారి ఉదయగిరి శాసన సభ్యునిగా ఎన్నికైన సందర్భంగా అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు ఎమ్మెల్యే అంటే రాజమోహన్‌రెడ్డిలా ఉండాలని మెచ్చుకున్నారు. పార్టీలు చూడకుండా ఒక కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఉన్న తమ అన్నను తెలుగుదేశం ముఖ్యమంత్రిగా ఉన్న రామారావు మెచ్చుకోవడం జరిగిందన్నారు. అటువంటి రాజకీయాలను వదిలేసి ఎదుటి పార్టీ వ్యక్తులను ఇబ్బందిపెట్టడం పనిగా పెట్టుకుని ఇప్పుడు చంద్రబాబు ప్రవర్తిస్తున్నారన్నారు. ఎన్నికల ముందు అలివిగాని హామీలతో మేనిఫెస్టో ప్రకటించి సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలను నమ్మించి అధికారం చేపట్టిన చంద్రబాబు.. గెలిచిన తర్వాత సూపర్ సిక్స్ పథకాలు ఏవయ్యా అంటే.. ఆకాశం వైపు చూసి పథకాలు ఎలా అమలు చేయాలో అర్థం కావడం లేదు, భయం వేస్తుంది చెప్తున్నారు తప్ప, ఇచ్చిన హామీలను నెరవేర్చే ఆలోచన చేయడం లేదని వివరించారు.

# శివయ్యస్వామికి స్మార్ట్‌గురు అవార్డుప్రదానం

● గతంలో మానవీయతాప్రతిభాపురస్కార్ కైవసం ● రాష్ట్ర బ్రాహ్మణసమాఖ్య ఉపాధ్యక్షుడుగా ప్రమాణం ● అభినందనలమయం

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆయన ఆత్మకూరుకు ఆధ్యాత్మిక ఆస్థి.. వేదమంత్రాలఖని.. ఆయనవాక్కు శుభసూచకానికి పునాది. ఆయన పౌరోహిత్యంత ప్రజలకు అత్యంత నమ్మకం.. ఆయన సేవానైజం సామాజికప్రయోజనం.. చిరునవ్వు ఆయన భూషణం.. సామాజికవర్గాన్ని ఆదుకోవడం ఆయన సేవానిరతికి నిదర్శనం.. ఆయన ఆత్మకూరులోని శ్రీ అన్నపూర్ణాసమేత కాశీవిశ్వేశ్వరాలయం (శివాలయం) ప్రధానఅర్చకులు, ఆత్మకూరు సీమ బ్రాహ్మణసేవాసమితి అధ్యక్షులు బ్రహ్మశ్రీ మేళ్ళచెరువు శివకుమార్‌శర్మ (శివయ్యస్వామి) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బ్రాహ్మణసమాఖ్య ఉపాధ్యక్షులుగా ఇటీవల ఎన్నికైన బ్రహ్మశ్రీ మేళ్లచెరువు శివకుమార్‌శర్మ (శివయ్యస్వామి.) ఆయన ఇటీవల ఏలూరులో జరిగిన రాష్ట్ర బ్రాహ్మణ సమాఖ్య మహాసభల్లో రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా ప్రమాణస్వీకారం చేసిన విషయం విధితమే. తాజాగా ఆదివారం సింహాచలంలో శివకుమార్‌శర్మకు స్మార్ట్‌గురు అవార్డు లభించింది. ఎన్‌ఎస్‌లైవ్ ఆస్ట్రోప్రవేట్ లిమిటెడ్ ఆర్యన్ అస్ట్రోలజీ రీసెర్చ్‌సెంటర్ వారు ఆయనకు కేంద్ర మాజీ పౌరవిమానయాన శాఖామంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు, విశాఖపట్టణం ఆర్‌ఎస్‌ఎస్ సంఘసంచాలక్ టి.వి.రమణ చేతులమీదుగా స్మార్ట్‌గురు అవార్డు ప్రదానంచేసి అత్యంత ఘనంగా సత్కరించి గౌరవపురస్కారాన్ని అందజేశారు. గతంలో ఆయన పౌరోహిత్యాన్ని, సామాజికసేవలను గుర్తించిన కడపకుచెందిన మనం ఫౌండేషన్ వారు మానవీయతాప్రతిభా పురస్కార్ అవార్డును బహూకరించారు. ఆయన నాలుగు దశాబ్దాలుగా ఆత్మకూరు శివాలయం ప్రధానఅర్చకులుగా కొనసాగుతున్నారు. ఆయన ఆధ్వర్యంలో శివాలయం దినదినప్రవర్ధమానమై వెలుగొందుతోంది. ఆత్మకూరు సీమబ్రాహ్మణసేవాసమితి అధ్యక్షులుగా ప్రతిఏటా పేద బ్రాహ్మణవటువులకు ఉచితంగా ఉపనయనాల కార్యక్రమం పెద్దఎత్తున నిర్వహిస్తుంటారు. బ్రాహ్మణసామాజికవర్గ అభివృద్ధికి, సంక్షేమానికి, ప్రోత్సాహానికి ఆయన విశేషంగా కృషిచేస్తుంటారు. కరోనా కష్టకాలంలో ఆయన తమ సామాజికవర్గీయులకు అందించిన సేవలు అమోఘం. 187కుటుంబాలకు నిత్యావసరసరుకులను అందించి ఆదుకున్నారు. ఆత్మకూరులోనే కాకుండా నెల్లూరు జిల్లాలోనే కాకుండా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని పలుజిల్లాల్లో ఆయన పౌరోహిత్యం నిర్వహిస్తుంటారు. ఆయన ఆధ్యాత్మికత, పౌరోహిత్యపటిమ, వాస్తుసేవలను గుర్తించి నాలుగేళ్ళక్రితం రాష్ట్ర అర్చక పురోహిత సంఘ ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఆత్మకూరు శివాలయంలో ఆయన ఆధ్వర్యంలో ప్రతిశివరాత్రినాడు రంగరంగ వైభవంగా శ్రీ కాశీవిశ్వేశ్వర స్వామి- అన్నపూర్ణా దేవిల కళ్యాణోత్సవం వీనుల విందుగా జరుగుతుంది. కార్తీకమాసంలో శివాలయం శివనామస్మరణతో మార్మోగుతుంటుంది. అన్ని ప్రధాన పండుగలు, పూజలు, హెూమాలు, అర్చనలు తదితరాలు అత్యంత వైభవంగా జరుగుతుంటాయి., శివయ్యస్వామిని ఆత్మకూరు ఆధ్యాత్మిక ఆస్థిగా, ఆయన మంత్రోచ్ఛారణ అత్యంత పవిత్రంగా, ఆయన హస్తవాసి అదృష్టంగా అందరూ భావిస్తుంటారు. రాష్ట్ర బ్రాహ్మణసమాఖ్య ఉపాధ్యక్షులు శివయ్యస్వామికి స్మార్ట్‌గురు అవార్డు లభించడంపట్ల శివాలయం భక్తమండలి, ఆత్మకూరు సీమ బ్రాహ్మణసేవాసమితి కార్యవర్గప్రతినిధులు, ఈప్రాంతంలోని అర్చకులు, వివిద పార్టీలు, ప్రజాసంఘాల ప్రతినిధులు, భక్తులు, అభిమానులు, శ్రేయోభిలాషులు అభినందనపరంపర కొనసాగించి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. తనపై విశ్వాసంతో రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు చెందిన తమ బ్రాహ్మణసమాఖ్య ప్రతినిధులు తనను రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా ఎన్నుకోవడం, తాజాగా స్మార్ట్‌గురు అవార్డు లభించడం సంతోషదాయకమని, తనను అభినందించినవారందరికీ ధన్యవాదాలని, తనవంతుగా యధావిధిగా సేవలందించడంతోపాటు ఈ అవార్డు స్ఫూర్తితో రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా తనవంతు బాధ్యతలను కర్తవ్యదీక్షతో నిర్వహిస్తానని శివయ్యస్వామి పేర్కొన్నారు.




# పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత : సామాజికవేత్త మాలకొండ రెడ్డి



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** సమాజంలో విరివిగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ కొరకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ప్రముఖ సామాజిక ఉద్యమ కార్యకర్త ఎం మాలకొండ రెడ్డి పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ రోజురోజుకు సమాజంలో వాయు కాలుష్యం, ధ్వనికాలుష్యం, జల కాలుష్యం పెరిగి ప్రతి ఒక్కరికి ఆరోగ్యం దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పౌరు సమాజం అడవులను కాపాడుకొని విరివిగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షించుకోవాలని కోరారు. పట్టణ ప్రాంతం కాంక్రీట్ జంగిల్‌గా మారిపోయింది. ఎవరు వీధుల్లో కూడా మొక్కలు నాటడం లేదు తద్వారా కార్బన్ డయాక్సైడ్ పెరిగి ఆరోగ్యం క్షీణిస్తుంది. స్వచ్ఛమైన గాలి పీల్చుకొని ఆరోగ్యంగా జీవించడం కొరకు ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ కవర్లను నియంత్రించి ప్లాస్టిక్‌ను వినియోగం నివారించి గుడ్డసంచులు శుభకార్యాలు అయితే దోనెలువిస్తర్లు వాడుకొని పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేస్తే ఆరోగ్య వంతమైనసమాజాన్ని నిర్మించుకొని వ్యాధులకు దూరంగా జీవించవచ్చునని తెలిపినారు. దీని కొరకు పౌర సంఘాలు,అధికారులు నిరంతరం ప్రజలలో అవగాహన పెంచి పర్యావరణ పరిరక్షణకు మనందరం కృషి చేసి పర్యావరణ పరిరక్షణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఆకాంక్షను తెలిపారు.

## ఉష్ణోగ్రతను తగ్గించేందుకు విస్తృతంగా చెట్లను నాటాలి

**కావలి, మేజర్‌న్యూస్ :** రోజురోజుకీ రాష్ట్రంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలను తగ్గించేందుకు చెట్లనుపెంచి, భూ పరిరక్షించేందుకు ప్రభుత్వాలు ముందుకు రావాలని సామాజిక మహిళా కార్యకర్త సి.శారద తెలిపారు. ఈ సందర్భంగా ఆమె వారు మాట్లాడుతూ.. రాను రాను వేసవి రాకముందే మండుటెండలు పెరిగిపోతూ ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. ధ్రువాలలో మంచు కరిగి సముద్రం మట్టం పెరుగుతుంది. నేతలకు విగ్రహాలు ఏర్పాటు చేయడం పాలాభిషేకాలు చేయడం పెద్ద ఎత్తున జన్మదిన ఉత్సవాలు జరుపుకోవడం కాదు కానీ ఈ సందర్భాల్లో మనిషి చెట్టు చొప్పున నాటి వన మహెూత్సవాలు జరిపి మొక్కలు నాటి పెంచడానికి ఉద్యమంగా చేపట్టేలా ప్రభుత్వాలు ప్రజలను మోటివేట్ చేయాలని తెలిపారు. చెట్లు పెంచే స్థలం ఉంటేనే ఇల్లు నిర్మాణానికి అనుమతి ఇచ్చే విధంగా ప్రభుత్వం జీవోను ప్రవేశపెట్టాలని పెరటి తోటలు పెంచే వారికి ప్రోత్సాహకాలు ఇవ్వాలని ప్రతి కార్యాలయంలో ప్రభుత్వ కార్యాలయం, విద్యాలయం, పరిశ్రమ, బ్యాంకు ఆవరణలో చెట్లు పెంచాలని, నిబంధనను తప్పనిసరి చేయాలని, వ్యక్తిగత, రాజకీయ కక్షలతో, చెట్లు నరికే వారిని తీవ్రంగా శిక్షించాలని వారు తెలిపారు. విస్తారంగా వృక్ష సంపద పెరిగి భూతాపం తగ్గుతుందని, కుటుంబాల్లో శుభకార్యాల సందర్భంగా చెట్లు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలని ప్రతి ఒక్కరు కూడా చెట్లు నాటే కార్యక్రమానికి భాగస్వామ్యులు కావాలని వారు తెలిపారు.

## నూతన సీసీ డ్రైన్ శంకుస్థాపన



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** కందుకూరు పట్టణంలోని 25వ వార్డు గాయత్రి నగర్‌లో సోమవారం రూ.10లక్షల రూపాయలతో నిర్మిస్తున్న నూతన సీసీ డ్రైన్ శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ముందుగా ఈ శంకుస్థానకు విచ్చేసిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరావుకి వార్డు పార్టీ నాయకులు కార్యకర్తలు మరియు కాంట్రాక్టర్ ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ గణపతి, పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, వార్డు అధ్యక్షుడు గుర్రం మాల్యాద్రి, పార్టీ నాయకులు ఉప్పుటూరి శ్రీనివాసరావు, కంద్రా మాల్యాద్రి, పెంట్రాల సుబ్బారావు, గుర్రం మల్లికార్జున, బత్తిన వెంకయ్య, బత్తిన మాల్యాద్రి, చిట్టాబత్తిన మాలకొండయ్య, నవులూరి మాలకొండయ్య, పొడపాటి నాగేశ్వరరావు, రావూరి రామకోటయ్య, ముచ్చు వేణు, శ్రీహరి నాయుడు కాంట్రాక్టర్ కంద్రా నర్సయ్య, దివి శంకర్, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ సర్టిఫికేట్ల ప్రధానం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులోని ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు స్కిల్ డెవలప్ మెంట్ ఇంటర్న్‌షిప్ కార్యక్రమం నిర్వహించారు. సోమవారం ఆ విద్యార్థులకు సర్టిఫికేట్లను ప్రధానోపాధ్యాయిని సి.హెచ్.అనంతలక్ష్మి పంపిణీ చేశారు. సమగ్రశిక్ష, స్కిల్‌డెవలప్‌మెంట్‌ల ఆధ్వర్యంలో ఇండస్, టైమ్స్‌ప్రోలిమిటెడ్ కంపెనీల తరపున ప్రధానోపాధ్యాయిని అనంతలోక్ష్మి ఆధ్వర్యంలో ఈకార్యక్రమం నిర్వహించారు. ఒకేషనల్ ఉపాధ్యాయులు గొల్లపాటి ఎజ్రా, బ్యూటీ అండ్‌వెల్నెస్ అంశంగురించి, నాగం వెంకటేశ్వర్లు రీటైల్‌సబ్జక్టు గురించి విద్యార్థులకు వివరించారు. ఈ అంశాల గురించి ప్రయోగాత్మకంగా వివరించారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికేట్లను అనంతలక్ష్మి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుపండిట్ డాక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## సైదాపురంలో వ్యక్తిపై హత్యాయత్నం



**సైదాపురం, మేజర్‌న్యూస్ :** సైదాపురం మండల కేంద్రంలోని సైదాపురం పంచాయతీలో ఎస్టీ కాలనీ నందు బాధితుడు తెలిపిన వివరాల మేరకు నెల్లూరు జిల్లా సైదాపురం మండలం కాలనీలో నివసిస్తున్న నక్క వరాలు గత 50 సంవత్సరాలుగా ఇక్కడే ఉంటూ పందులు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నట్టు 20 సంవత్సరాల క్రితం తమ ఇంటి సమీపంలోకి వచ్చిన నక్క సీనయ్య అనే వ్యక్తి గత కొంతకాలంగా తమ జీవాలను (పందులు) అపహరిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఈ నేపద్యంలో ఈరోజు తన పై అక్రమంగా పోలీసులకు పిర్యాదు చేశారని తెలియడంతో తాను, తన అమ్మ తమఇంటి వద్ద మాట్లాడుతూ.. వుండగా తనని చంపాలనే ఉద్దేశ్యంతో నక్కా శీనయ్య, నక్కా వెంకటేశ్వర్లు తన తల పగలగొట్టి చంపే ప్రయత్నం చేశారని తనకు పోలీసులు న్యాయం చేయాలని బాధితుడు నక్కా వరాలు తెలిపారు. ప్రస్తుతం బాధితులు నక్క వరాలు సైదాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

## భూసార పరీక్షలపై రైతులకు అవగాహన



**సైదాపురం, మేజర్‌న్యూస్ :** మండలంలోని కమ్మవారిపల్లి గ్రామంలో భూసార పరీక్షలు, ఊరిలో ప్రత్యామ్నాయ పంటల మీద అవగాహన కార్యక్రమం చేపట్టారు. భూసార పరీక్షలు ప్రతి రైతు తప్పనిసరిగా చేసుకోవాలని రైతులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. అదేవిధంగా సూక్ష్మ, స్థూల పోషకాల యొక్క స్థాయిని స్థితిగతులను కూడా ఈ మట్టి పరీక్షల ఫలితాల ఆధారంగా మాత్రమే నిర్ణయించుకోబడతాయి. కాబట్టి ప్రతి రైతు సోదరుడు కూడా భూసార పరీక్షలను చేసుకోవాలని తెలియజేశారు. అలానే సమ్మర్ పల్సస్ గురించి కూడా రైతులకు తెలిపారు. ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు పలు సూచనలు సలహాలు తెలియజేశారని మండల అగ్రికల్చర్ అధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ ఏవోలు రైతులు ఇదితరులు పాల్గొన్నారు.

## బీసీ సబ్సిడీ లోన్స్‌లో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించాలి : సుభాష్ యాదవ్

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలోని కలెక్టరేట్ ప్రాంగణంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించన బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మద్దులూరు సుభాష్ యాదవ్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత రెండు నెలల క్రితం బీసీలకు స్వయం ఉపాధి క్రింద రాష్ట్ర ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు విడుదల చెయ్యడం జరిగిందని, జిల్లా వ్యాప్తంగా వేలాది మంది బీసీ నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకున్నారు. ఈ నిరుద్యోగ యువతని ఆసరాగా చేసుకొని కొంత మంది దళారులు ప్రభుత్వ అధికారులు పరస్పర సహకారంతో లోన్స్ ఇప్పిస్తామని కొంతమంది దరఖాస్తు దారులకు మాయమాటలు చెప్పి డబ్బులు వసూలు చేశారని, ఇందు వలన నిజమైన లబ్ధిదారులు లోన్స్ పొందలేని పరిస్థితి ఏర్పడినది కావున జిల్లా వ్యాప్తంగా ఈ విషయం పైన విచారణ జరిపించి తగు చర్యలు తీసుకోవలసిందిగా సుభాష్ యాదవ్ కోరారు.

# విధుల నిర్వహణలో అందరి సహకారానికి ధన్యవాదాలు : సూర్యతేజ



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ గా విధుల నిర్వహణలో సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నట్లు బదిలీపై వెళ్తున్న సూర్యతేజ హర్షం వ్యక్తం చేశారు. నగర పాలక సంస్థ కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో సూర్యతేజ ఆత్మీయ వీడ్కోలు సన్మానం కార్యక్రమాన్ని ఇంచార్జ్ కమిషనర్ వై.ఓ నందన్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా జిల్లా కలెక్టర్ ఆనంద్ పాల్గొని నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా సూర్యతేజ అందించిన విశిష్ట సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ముందుగా వేద పురోహితులు సూర్యతేజను సాదరంగా ఆహ్వానించి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో సూర్య తేజ ఉత్తమ ప్రతిభను కనబర్చి పాలనలో సహకరించారని, ప్రభుత్వం సూచించిన ఏపీడీఎస్ ఎండీగా నూతన విధుల్లో కూడా ఇలాంటి ప్రతిభనే ప్రదర్శిస్తారని ఆకాంక్షించారు. ఎస్పీ కృష్ణకాంత్ మాట్లాడుతూ.. కార్పొరేషన్ పరిధిలో శాంతి భద్రతలను పరిరక్షించడంలో ఎంతగానో సమన్వయంతో సహకరించారని, నూతన విధుల్లో మరింత ఉన్నతిని సాధించాలని కోరారు. జిల్లా జాయింట్ కలెక్టర్ కార్తీక్ మాట్లాడుతూ.. సూర్యతేజతో ఉన్న అనుబంధాన్ని అందరితో పంచుకున్నారు. విజయవాడ వరదల సమయంలో సూర్య తేజ అందించిన సేవలు అపూర్వమని కొనియాడారు. సూర్యతేజ మాట్లాడుతూ.. కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన సమయం నుంచి విధుల్లో సహకరించిన అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. నగర పాలక సంస్థ అభివృద్ధికి అందరూ కృషి చేయాలని ఆకాంక్షించారు. అనంతరం విభాగాల వారీగా సూర్యతేజ దంపతులను గజమాలలతో అభినందించి అందరూ సన్మానించారు. ఈ వీడ్కోలు కార్యక్రమంలో సూర్యతేజ సతీమణి అమూల్య, నగర పాలక సంస్థ అన్ని విభాగాల అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నిర్దిష్ట గడువులోపు పరిష్కారాలను అందించండి

## ఇన్‌చార్జ్ కమిషనర్ నందన్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లనుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందుకున్న స్థానిక సమస్యలకు నిర్దేశించిన గడువులోపు పరిష్కారం అందించాలని అధికారులను ఇన్‌చార్జ్ కమిషనర్ వై.ఓ నందన్ ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను నెల్లూరు నగర పాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ విభాగం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించారు. ఇన్‌చార్జ్ కమిషనర్ నందన్ పాల్గొని అర్జీదారుల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ.. టిడ్కో గృహాల లబ్ధిదారులకు వివిధ కారణాలతో బ్యాంకుల నుంచి రుణాలు అందలేదని, వారు చెల్లించిన మొత్తాలను తిరిగి చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. అదేవిధంగా ఇంకా పూర్తికాని నిర్మాణాలను పూర్తిచేసి లబ్ధిదారులకు కేటాయించనున్నామని తెలిపారు. పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి రోడ్డు ఆక్రమణలు, అక్రమ నిర్మాణాల గురించి, మార్టగేజ్ విడుదల గురించి అర్జీలు అందుకున్నామని తెలిపారు. ఇంజనీరింగ్ విభాగానికి సంభందించి రోడ్లు, డ్రైను కాలువల నిర్మాణం, సివిల్ వర్కులు, వీధి దీపాల ఏర్పాటు తదితర సమస్యలను అందుకున్నామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వివిధ అంశాలపై ప్రజల నుంచి అందుకున్న ఫిర్యాదులు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం అందించాలని, వాటన్నింటికీ నిర్ణీత సమయంలోగా పరిష్కారం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విభాగాల వారీగా ఇంజనీరింగ్7, హౌసింగ్-17, టౌన్ ప్లానింగ్-12, రెవెన్యూ-8, పబ్లిక్ హెల్త్-3, ఆఫ్కోస్-6, అకౌంట్ సెక్షన్-2, మొత్తం-55 ఫిర్యాదులను అందుకున్నారు. ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ రామ్ మోహన్ రావు, ఆరోగ్య శాఖధికారి డాక్టర్ చైతన్య, సెక్రటరీ శ్రీలక్ష్మి, సిటీ ప్లానర్ పద్మజ, మేనేజర్ ఇనాయతుల్లా, ఇతర అన్ని విభాగాల అధికారులు, సూపరెంటెండెంట్ లు, సిబ్బంది పాల్గొన్నారు.

# నేదురుమల్లి విగ్రహానికి స్థలం కేటాయించండి : నారపరెడ్డి



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** ఉమ్మడి నెల్లూరు జిల్లా ప్రాంతానికి చెందిన మాజీ ముఖ్యమంత్రి కీ.శే. నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని కలెక్టర్‌ను, నగర మున్సిపల్ కమిషనర్‌ను సోమవారం కోరినట్లు సిటీ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కే.సంజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి సుధీర్ తెలిపారు. నగర కాంగ్రెస్ అధ్యక్షుడు నారపరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు గతంలో ఆంధ్ర రాష్ట్ర మంత్రిగా ముఖ్యమంత్రిగా (1990–92) పదవి బాధ్యతలు నిర్వహించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో ప్రజలకు ఎంతో సేవలు చేసిన మహానుభావుడు, అనేకమంది విద్యార్థులకు, ఉన్నత విద్య అందించేలా ప్రోత్సహించడమే కాకుండా పలు సామాజిక సేవలు అందించారని, నాలుగు చట్టసభల్లో ప్రాతినిధ్యం వహించిన ఏకైక నెల్లూరు రాజకీయవేత్త, దేశ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీ సభ్యులుగా ఎంతోమంది ని చట్టసభలకు పంపి రాష్ట్ర, కేంద్ర మంత్రులుగా తీర్చిదిద్దిన రాజకీయ గురువు నేదుర మల్లి జనార్దన్ రెడ్డి అని కిరణ్ కుమార్ రెడ్డి కొనియాడారు. అలాంటి గొప్ప వ్యక్తికి సిటీ పరిధిలోని కూడలిలో విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించడం సముచితమని, నెల్లూరు నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఇందుకోసం ప్రత్యేక చొరవ తీసుకోవాలని విగ్రహం ఏర్పాటుకు అయ్యే ఖర్చులను నెల్లూరు నగర కాంగ్రెస్ కమిటీ ఏర్పాటు చేయగలరని కాంగ్రెస్ పార్టీ తరఫున విజ్ఞప్తి చేస్తున్నట్లు కిరణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిటీ ఉపాధ్యక్షులు ఇర్ఫాన్, రూరల్ ఇంచార్జ్ మల్లికార్జున్ రెడ్డి, ధనుంజయ్, సేవాదళ్ సుజాత, బద్రి, సమీర్, రాజశేఖర్ రెడ్డి, రసూల్, నూర్, చాంద్ బాషా, నెహెమ్యా, వరదా రెడ్డి, అంబేద్కర్, వెంకటేశ్వర రెడ్డి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఆనం పేరారెడ్డిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో 13వ వార్డు పుల్లారెడ్డి నగర్‌కు చెందిన వైసీపీ నాయకులు ఆనం పేరారెడ్డి ఇటీవల అనారోగ్యంతో వైద్యశాల నందు చికిత్స పొంది వారి గృహం వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి వారి గృహానికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని కోరుతున్నారు.

## ట్రాన్సిషన్ తరగతులను పరిశీలన



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని అప్పసముద్రం జిల్లా ఉన్నత పాఠశాలలో ట్రాన్సిషన్ తరగతులను మండల విద్యాశాఖ అధికారి-2 తోట శ్రీనివాసులు సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు ఈరోజు నుండి ప్రతి పాఠశాలలో 1వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులను 2వ తరగతి గదిలో అదేవిధంగా 2వ తరగతి పూర్తిచేసిన విద్యార్థులను 3వ తరగతి గదిలో ఆ విధంగా పదవ తరగతి వరకు విద్యార్థులను ప్రమోట్ చేసి ఆయా తరగతి గదులలో ప్రవేశం కల్పించి విద్యార్థులచే గేయాలు, కథలు, పద్యాలు, ఏదైనా విషయం గురించి మాట్లాడుట తదితర అంశాలపై అవగాహన కల్పించాలని ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులకు తెలియజేశారు. వేసవి సెలవులలో విద్యార్థులు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు దుర్గాప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యుత్ చార్జీలు వెంటనే తగ్గించాలి : కోడె రమణయ్య



**సీతారాంపురం, మేజర్‌న్యూస్ :** పెరిగిన విద్యుత్ చార్జీలో వెంటనే తగ్గించాలని మండల సీపీఎం నాయకులు కోడె రమణయ్య తెలిపారు. సోమవారం నాడు పడమటి రొంపి దొడ్ల గ్రామంలో గ్రామస్తులతో కలిసి పెరిగిన విద్యుత్ బిల్లులను చూపిస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్త ప్రభుత్వ పాలకులు వచ్చిన ప్రతిసారి ప్రజలపై భారం మోపే విధంగా విద్యుత్ చార్జీలను పెంచుతున్నారు తప్ప ఏ ఒక్కరూ తగ్గించిన పాపాన పోలేదని తెలిపారు. ప్రస్తుతం పేదవాడు 30వ తారీకు వచ్చేసరికి కరెంటు బిల్లులు పట్టుకుంటే భయపడుతున్నాడని తెలిపారు. నివాసముండే ఇంట్లో అంధకారంలో ఉండలేక కరెంటు బిల్లులు తట్టుకోలేక కుటుంబాన్ని పోషించుకోలేక దయనీయ స్థితిలో ఉన్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు పేదల బ్రతుకులను అర్థం చేసుకొని కరెంటు బిల్లులను తగ్గించాలని కోరారు.

## వన్..బిలు తొలగించాలని తహసిల్దార్‌కు వినతి

**సైదాపురం, మేజర్‌న్యూస్ :** శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సైదాపురం మండలంలోని పాలూరు పంచాయతీలో గ్రామ సర్వేనెంబరు 441ఉన్న ఎకరా 66 సెంట్లు భూమి తిరుపతి జిల్లా గూడూరు రూరల్ మండలం నెన్నూరు గ్రామంకు చెందిన మాతండ్రి సురాబత్తిన రామయ్యకి సంబందించింది ఆభూమిని సురాబత్తిన రయ్యత్న కుమారులు సురాబత్తిన శ్రీనువాసులు, సురాబత్తిన నాగార్జునలపై తహసీల్దార్ టి.ప్రవీణ్ కుమార్ ఎలా ఆన్‌లైన్‌లో వన్.. బి ఎలా ఎక్కిస్తారు. ఆ వన్.. బి తొలిగించాలని తహసీల్దార్ రమదేవికి సోమవారం వినతపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మ మా నాన్న కి సంబందించిన ఆరు మంది కుమారులకు రావాల్సిన భూమిని ఒక్క కుమారుడు సురబత్తిన రత్నయ్య కుమారులు వన్.. బి పాసుబుక్ అప్పటి తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ చేశారు. కార్యాలయం వద్ద నిరసన చేశారు. తండ్రి రామయ్యకి ఏడు మంది కుమారులు పెద్ద కుమారుడుకు సంబందించిన కుమారులపై ఏవిదంగా ఉమ్మడి ఆస్తిని చేస్తారని ఆరోపించారు. సమాచారం ఇవ్వకుండా తహసీల్దార్ ఆన్‌లైన్‌లో భూమిని మార్చిరాని చెప్పారు.



# నెల్లూరులో హౌసింగ్ మాయాజాలం.!

- ఏ ఇంట్లోనూ సామాగ్రి కనిపించలేదు..
- మోడీ సర్కార్ నిధులు దుర్వినియోగంపై ఏసీబీకి బీజేపీ ఫిర్యాదు



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** తలుపులు ద్వారా బంధరాలు కిటికీలు కరెంటు సామాన్లు శానిటరీ సామాన్లు ఇవ్వకుండానే ఇచ్చినట్లు రికార్డులలో నమోదుపై బీజేపీ నేత మిడతల రమేష్ ఏసీబీ డీఎస్పీ శిరీషకు ఫిర్యాదు చేశారు. నెల్లూరు లే అవుట్‌లోని ఫైనల్ బిల్లులు చేసిన ఇండ్లను తాము పరిశీలిస్తే ఒక్క ఇంటికి కూడా తలుపులు కిటికీలు ఎలక్ట్రిఫికేషన్ శానిటేషన్‌లకు సంబంధించి 32,500 రూపాయలు విలువ చేసే సామాగ్రి ఏ ఇంట్లోనూ కనిపించలేదు. లబ్ధిదారులకు మాత్రం ఇచ్చినట్లుగా ఆన్‌లైన్‌లో నమోదు చేసి గృహ నిర్మాణం చేసిన కాంట్రాక్టర్ల నుండి డబ్బులు వసూలు చేశారు. ఇదేవిధంగా జిల్లాలోని అన్ని లేఔట్లలో మెటీరియల్స్‌ను యదేచ్ఛగా దోచేశారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం పేదలందరికీ లేఅవుట్ లలోనే గృహ నిర్మాణాలు చేపట్టవలసి ఉంది. నెల్లూరు అర్బన్‌లో సొంత స్థలాలలో ఆప్షన్ త్రీ కింద వందల గృహాలు నిర్మించారు. జియో ఫెన్సింగ్ ఫోటోలలో కూడా మాయాజాలాన్ని ప్రదర్శించారు. 90 రోజులలో ఒక గృహాన్ని వివిధ స్టేజీలలో నిర్మాణాలు చేసి విడతల వారీగా బిల్లులు చెల్లించాల్సి ఉంది. 90 రోజులకు బదులు 9 రోజులలో కొన్ని గృహాలు 6 రోజులలో కొన్ని గృహాలు 4 రోజులలో కొన్ని గృహాలు నిర్మించినట్లు జియో ఫెన్సింగ్ ఫోటోలు మాయ చేసి బిల్లులు చెల్లించారు. పాత ఇళ్లకు సాంకేతిక పరిజ్ఞానాన్ని దుర్వినియోగం చేసి లే అవుట్లలో గృహాలుగా బిల్లులు చెల్లించారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమాలు చేసిన అధికారులు ఒకరైతే ఆన్‌లైన్‌లో మాత్రం నెల్లూరులోనే విధులు నిర్వహించని అధికారులను బాధ్యులుగా ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. అమరావతిలో మైక్రో ఇన్ఫర్మేషన్ సిస్టం (ఎంఎస్ఐ) ఒక ఆన్‌లైన్ గేమ్ లాగా యదేచ్ఛగా దోపిడీకి దుర్వినియోగం చేశారు. కేంద్ర ప్రభుత్వం వద్ద ఉన్న సాంకేతిక పరిజ్ఞానం కంటే అవినీతి హౌసింగ్ అధికారుల వద్ద సాంకేతిక మాయా పరిజ్ఞానం పటిష్టంగా ఉంది. నిధులను దుర్వినియోగం బయటపడితే సంబంధం లేని అధికారులు బలి అయ్యేవిధంగా ఎంఐఎస్‌ను దుర్వినియోగం చేశారు. నెల్లూరులో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని విజిలెన్స్ అధికారులు నివేదిక ఇస్తే అవినీతి అధికారులపై చర్యలు తీసుకోకుండా హెడ్ ఆఫీస్‌లో ఒక ఏస్సీ ఏడాది గడువు ఇచ్చి రికార్డులలో లబ్ధిదారుల సంతకాలు ఫోర్జరీ చేయించి అవినీతి అధికారులను కాపాడారు. హౌసింగ్ నిధులు దుర్వినియోగంపై విచారణ జరపాలని డీఎస్పీ శిరీషకు రమేష్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కందికట్ల రాజేశ్వరి పొట్లూరు శ్రీనివాసులు, యాకసరి ఫణి రాజు, రఘురామయ్య, చిత్తాతూరు పద్మ వతి, కావటి శిరీష, ఏవి సుబ్బయ్య కరణం వెంకటరావు, కే.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## తహసిల్దార్ కార్యాలయం వద్ద చలివేంద్రం ప్రారంభం



**సైదాపురం, మేజర్‌న్యూస్ :** సైదాపురం మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం వద్దకు వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు మండల తహసిల్దార్ రమాదేవి, ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ ఆధ్వర్యంలో చలివేంద్రాలు ప్రారంభించినట్లు తెలిపారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని సోమవారం తహసిల్దార్ కార్యాలయం వద్ద, మండల పరిషత్ కార్యాలయం వద్ద రెండు ప్రాంతాల్లో రెండు చలివేంద్రాలను సైదాపురం మండల తహసిల్దార్, ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చలివేంద్రాలను ఏర్పాటు చేయడానికి ప్రధాన కారణం. పెరుగుతున్న ఎండలకు అనుగుణంగా ప్రజలకు దాహార్తి తీర్చేవిధంగా మండల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని భావించి చలివేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రజలు ఎవరు కూడా ఎక్కువ టైం బయట తిరగరాదని, అలా తిరగడం వల్ల వడదెబ్బ తగిలే అవకాశాలు ఉన్నాయని, ఎండలో ఎక్కువ టైం తిరగడం వల్ల తీవ్ర అనారోగ్య పరిస్థితులు తలెత్తే అవకాశం ఉన్నాయని, ఎండల్లో తగినంత నీరు తీసుకోవాలని తహసిల్దార్ రమాదేవి, ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్, తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, తహసిల్దార్ కార్యాలయం సిబ్బంది. తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు భూసార పరీక్షలపై అవగాహన



**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలంలో రైతుల కోసం భూసార పరీక్షలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వరి పంటకు ప్రత్యామ్నాయంగా తడి పంటలైన పెసర, మినుము, మొక్క జొన్న వంటి పంటల సాగు లాభదాయకమని అధికారులు రైతులకు వివరించారు. ఈ సందర్భంగా మండలానికి మొత్తం 1456 మట్టి నమూనాలను సేకరించి ప్రయోగశాలకు పంపించాలనే లక్ష్యాన్ని వ్యవసాయ శాఖ నిర్దేశించింది. గ్రామాల వారీగా పంటల విస్తీర్ణాన్ని ఆధారంగా తీసుకుని గ్రామ వ్యవసాయ సహాయకులు ఈ మట్టి నమూనాలను సేకరించి, పరీక్షల కోసం పంపించనున్నారు. పరీక్షల ఫలితాలను భూసార కార్డుల రూపంలో రైతులకు అందించనున్నారు. ప్రకృతి వ్యవసాయం విధానాలను అనుసరించి పంటలు సాగు చేయడం ద్వారా నేల నాణ్యత మెరుగవుతుందని, ఉత్పాదకత పెరుగుతుందని ఈ సమావేశంలో వివరించారు. మట్టి నమూనాల సేకరణకు రైతులు తమ వంతు సహకారం అందించాలని అధికారులు కోరారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు ఎన్.శ్రీనివాసులు, డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్ మాలకొండయ్య, మండల పరిషత్ అభివృద్ధి అధికారి కల్పన మేడం, మండల వ్యవసాయ అధికారి డి.హరి కరుణాకర్ రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు, పొదుపు సంఘాల సభ్యులు, ఐసిఆర్‌పిలు, కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్ విమలాలర్ రెడ్డి పాల్గొన్నారు. రైతులు ప్రకృతి పద్ధతుల్లో సాగుకు ఆసక్తి చూపిస్తే, భవిష్యత్తులో అధిక దిగుబడులు సాధించగలరని కార్యక్రమం ద్వారా స్పష్టమైంది.

## నందవరం మోడల్ స్కూల్‌లో ప్రవేశ పరీక్ష

**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మర్రిపాడు మండలం, నందవరంలోని ఏపీ ఆదర్శ పాఠశాలలో ఆరవ తరగతి ప్రవేశ పరీక్ష సోమవారం జరిగింది. అందుకు సంబంధించి ఆన్లైన్లో 81 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులలో 71 మంది పరీక్షకు హాజరవ్వగా పదిమంది గైర్హాజరయ్యారు. విద్యార్థుల ప్రవేశ పరీక్షకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తిచేసి ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ దగ్గరుండి పరీక్షను జరిపించారు.

## గుర్రప్ప స్వామికి ప్రత్యేక పూజలు



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు మండలి నడుమూరులో వేంచేసియున్న గురప్ప స్వామి అంకాలమ్మ నాగవరపమ్మ అమ్మవార్లకు సోమవారాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు జరిపించారు. గురవారెడ్డి ఆధ్వర్యంలో ఉదయాన్నే స్వామివారికి అమ్మవార్లకు ప్రత్యేకంగా అభిషేకములు జరిపించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు ఉదయాన్నే ఆలయాన్ని చేరుకుని స్వామివారి కనులారా దర్శించి తీర్థ ప్రసాదములు సేకరించి ఓ నేతలు అయ్యారు.

## యునెస్కో భగవద్గీతను గుర్తించడం నేటి పరిస్థితుల్లో గర్వించదగిన విషయం : బీజేపీ నేత మిడతల రమేష్

**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** యునెస్కో భగవద్గీతను గుర్తించడం నేటి పరిస్థితుల్లో గర్వించదగిన విషయ మనీ బిజెపి నేత మిడతల రమేష్ పేర్కొన్నారు. ప్రపంచంలో మతాలు పుట్టకముందే 5115 సంవత్సరాల క్రితం శ్రీకృష్ణ పరమాత్ముడు వ్యక్తి వికాసం ను అర్జునుడుకు బోధించాడు. భారతీయులు పవిత్రంగా పూజించే భగవద్గీత హిందువుల గ్రంథంగా మారిపోయింది. యునేస్కో పుట్టకముందే భారతీయ జ్ఞానసంపద. సంస్కృతి, నాగరికత, ధర్మాధర్మ విచక్షణ ద్వారా మానవాళి జీవించే విధానం బోధనే భగవద్గీత. మా మతమే గొప్పది అనే భావనలో కొందరు కొట్టుమిట్టాడుతున్న సమయంలో యునెస్కో ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా భగవద్గీతను గుర్తించడం శుభ పరిణామం అని రమేష్ పేర్కొన్నారు.

## వీఎస్‌యూ పరిశోధన విద్యార్థినికి డాక్టరేట్



**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** అనంతపురం జిల్లా నార్పల గ్రామనికి చెందిన మనోజ పద్యాలకి కాకుటూరు విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రధానం చేసింది. పర్యాటక శాఖ విభాగానికి చెందిన డాక్టర్ కోట నీలమణికంఠ పర్యవేక్షణలో ఆమె పరిశోధనలు చేశారు.

**గాస్ట్రోనమీ టూరిజం :** స్థిరమైన పర్యాటక అభివృద్ధికి ఒక సంభావ్య మౌల్యాంకన పై మనోజ అధ్యయనం చేశారు. ఆ అంశంపై తన పరిశోధన విజయవంతంగా పూర్తి చేసినందుకు విశ్వ విద్యాలయం డాక్టరేట్ ప్రధానం చేసింది. ఈ సందర్భంగా సోమవారం ఉదయం విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ కె సునీత, కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సిహెచ్ విజయ, పరిక్షల నియత్రణ అధికారి డాక్టర్ ఆర్.మధుమతి, పర్యాటక శాఖ విభాగాధిపతి డాక్టర్ పి.సుజాత, ప్రొఫెసర్ కేవీఎస్ఎన్ జవహర్ బాబు, డాక్టర్ ఎం.త్యాగరాజు అభినందిచారు. అధ్యాపకులు, పరిశోధనా విద్యార్థులు శుభాకాంక్షలు తెలియజేశారు.

## నేడు విద్యుత్ అదాలత్

APTRANSCO

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు ట్రాన్స్‌ఫోర్ట్ డీఈ కార్యాలయంలో మంగళవారం విద్యుత్ అదాల నిర్వహించినట్లు ట్రాన్స్కో ఇన్‌చార్జ్ ఏఈ కుదూస్ భాష సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీతారాంపురం, ఉదయగిరి, దుత్తలూరు, వరికుంటపాడు మండలాల్లోని విద్యుత్ వినియోగదారులకు ఏమైనా సమస్యలు ఉంటే విద్యుత్ ఆదాలత్లో పాల్గొని పరిష్కరించుకోవచ్చునన్నారు. కావున వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# మట్టి నమూనా పరీక్షల గురించి రైతాంగానికి అవగాహన

**హాజరైన శాస్త్రవేత్తలు వ్యవసాయ శాఖ అధికారులు**



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** మట్టి నమూనా పరీక్షలు అదేవిధంగా వరికి బదులు ప్రత్యామ్నాయంగా ఇతర పంటల గురించి రైతులకు వ్యవసాయ శాఖ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమం సోమవారం ముసునూరు వారి పాలెం గ్రామంలో జరిగింది. రైతులతో పాటు సాగునీటి సంఘం కార్యవర్గం హాజరైంది. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలుశివ జ్యోతి, అనూష పాల్గొన్నారు. ఈ రెండు అంశాల గురించి శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. వేసవి నందు వరికి ప్రత్యామ్నాయంగా పెసర, నువ్వు పంటలు అనుకూలమని వచ్చేనెల ఆఖరి వారం వరకు నాటు వేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. పెసరలో పల్లాకు తెగులను నివారించే రకాలైనటువంటి ఎల్‌జిజి రకాలను నువ్వు పంటలో మేలైన వైఎల్‌ఎం 66 రకాల గురించి సమగ్రంగా తెలియజేశారు. ఇందుకూరుపేట అధికారులు మట్టి నమూనాల సేకరణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. 2025- 26 ఆర్థిక సంవత్సరంలో 825 మట్టి నమూనాలను లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలియజేశారు. రైతు సేవా కేంద్రానికి 60 నుంచి 70 మట్టి నమూనాలు లక్ష్యంగా చెప్పినామని అధికారులు పేర్కొన్నారు. రైతులు తప్పనిసరిగా మట్టి పరీక్షలు చేయించుకొని తద్వారా పంట పొలాల్లో పోషకాల పరిమాణాన్ని తెలుసుకొని అనుగుణమైన ఎరువులను వాడినందువల్ల పెట్టుబడి తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ ఆఫీసర్ జోత్స్న రాణి తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మకూరులో వేసవిసంగీతనృత్యశిక్షణ : అపర్ణాచక్రవర్తి



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులోని తమ నృత్యవిద్యాలయంలో ప్రత్యేక వేసవిసంగీత, నృత్య శిక్షనా శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నామని స్థానిక శ్రీభారతి సంగీత నృత్యవిద్యాలయం నిర్వాహకురాలు కొండూరు అపర్ణచక్రవర్తి పేర్కొన్నారు. గత మూడేళ్ళుగా ఆత్మకూరులో ఆమె సంగీతనృత్యవిద్యాలయం నిర్వహిస్తూ అనేకమందికి సంగీతం, నృత్యంలో శిక్షణ ఇస్తున్న విషయం విధితమే. కాగా ఈ వేసవిలో ప్రత్యేక శిక్షణ అవకాశం కల్పించాలన్న లక్ష్యంగా ఈనెల 30వ తేదీ నుండి జూన్ 7వ తేదీవరకు ప్రత్యేక శిబిరం నిర్వహించతలపెట్టామని, ఈనెల 24వ తేదీ నుండి అడ్మిషన్లు ప్రారంభిస్తామని అపర్ణచక్రవర్తి పేర్కొన్నారు. ఆత్మకూరు పట్టణంలోని ప్రజలు, విద్యార్థినీ, విద్యార్థులు, కళాభిమానుల కోసం ఈ ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేస్తున్నామని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. గత 3సంవత్సరాలుగా ఎంతోమందిని శాస్త్రీయసంగీతం, నృత్యంలో తీర్చిదిద్దామని, ఈ వేసవి శిబిరం ఇటీవల ప్రారంభించిన డాక్టర్ వి.దొరసానమ్మ చారిటబుల్‌ట్రస్ట్ భవనంలో ఏర్పాటు చేశామన్నారు. ఈప్రత్యేక నృత్యశిక్షణా శిబిరానికి కూచిపూడి వాస్తవ్యులు, 45సంవత్సరాల కూచిపూడి నృత్యంలో అనుభవం కలిగిన శ్రీవేదాంతం విదుమౌళి నృత్యగురువుగా రానున్నారన్నారు. అలాగే శాస్త్రీయ సంగీతానికి 35సంవత్సరాల అనుభవం కలిగిన అనంతబొట్లరమాదేవి సంగీత గురువుగా తమ శిబిరానికి రానున్నారని అపర్ణ పేర్కొన్నారు. ఈ వేసవి దృష్ట్యా నూతనభవనంలో ఏసిలో తరగతులు నిర్వహిస్తామని, ఉడెన్‌ఫ్లోరింగ్, చుట్టూరా లైఫ్‌సైజ్ మిర్రర్స్ తో తీర్చిదిద్దామన్నారు. ఆత్మకూరు పట్టణ ప్రజలు తాము నిర్వహించే సంగీత,నృత్య శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని, తమ పిల్లలకు ఈవేసవి శిబిరంలో సంగీతం, నృత్యంలో ప్రాథమిక శిక్షణ ఇప్పించాలని అపర్ణాచక్రవర్తి కోరారు. వివరాలకు 8125912923, 9290027243 నెంబర్లతో సంప్రతించాలని ఆమె పేర్కొన్నారు.

# బసవరాజుపాళెంలో పౌష్టికాహార సదస్సు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలంలోని బసవరాజుపాళెంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా అవగాహనా సదస్సు నిర్వహించారు. సిడిపివో పి.సునీలత పర్యవేక్షణలో సూపర్‌వైజర్ ఎన్.నాగేశ్వరమ్మ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఈసదస్సు, పౌష్టికాహార ప్రదర్శన నిర్వహించారు. నాగేశ్వరమ్మ ప్రసంగిస్తూ పౌష్టికాహారం వలన ప్రయోజనాలను వివరించారు. గర్భిణీలు, బాలింతలు, మహిళలు, కిశోరబాలికలు, చిన్నారులకు తప్పకుండా పౌష్టికాహారం అత్యంతావశ్యకమన్నారు. గర్భిణీలు, బాలింతలు, పుట్టే బిడ్డలు ఆరోగ్యవంతంగా ఉండేలా ప్రభుత్వం అనేక పౌష్టికాహర పంపిణీ కార్యక్రమాలు నిర్వహిస్తుందని, పౌష్టికాహారం గురించి అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తుంటామని ఆమె తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో 1000రోజుల ప్రత్యేక కార్యక్రమం ద్వారా మాతా,శిశుసంరక్షణకు నిర్వహిస్తున్నామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేసే పోషకవిలువల ఆహానాన్ని లబ్దిదారులే తప్పకుండా వినియోగించుకోవాలని, దాంతో పాటు తమకు అందుబాటులో ఉండే పౌష్టికాహారాన్ని తీసుకోవాలని నాగేశ్వరమ్మ కోరారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు రక్తహీనతకు గురికాకుండా ఉండాలన్నదే లక్ష్యంగా పౌష్టికాహారం అందజేస్తున్నామని, పౌష్టికాహారం గురించి అవగాహన కల్పిస్తున్నామని ఆమె తెలిపారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు వై.కేశవరత్నమ్మ, నాగేశ్వరమ్మ, నాగరత్నమ్మ, ఎన్.శారదావిజయకుమారి, ఎన్.రాములమ్మ, పి.సుజాత, అంగన్‌వాడీ కేంద్రాల సహాయకులు, పలువురు గర్భిణీలు, బాలింతలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## రైతులకు సబ్సిడితో వ్యవసాయపనిముట్లు పంపిణీ



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులో రైతులకు మండల వ్యవసాయాధికారి కె.కిషోర్‌బాబు ఆధ్వర్యంలో 50శాతం సబ్సిడితో ఆధునిక వ్యవసాయ పనిముట్లను సోమవారం పంపిణీ చేశారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి 50శాతం సబ్సిడితో మండలంలోని రైతులకు 15కల్టివేటర్లు, 4రోటోవేటర్లు, 7 స్ప్రేయర్లును పంపిణీ చేశామని కిషోర్‌బాబు పేర్కొన్నారు. ఆధునిక యంత్రాలతో రైతులు వ్యవసాయాన్ని పెంపొందించుకోవాలని ఆయన కోరారు. ఆరవేడుకు చెందిన తలచీరు వెంకటసుబ్బయ్యకు రోటోవేటర్ అందజేశామని, మిగతా వారికి కూడా అందజేస్తున్నామని కిషోర్ బాబు పేర్కొన్నారు. ఆధునిక యంత్రాలు, పనిముట్లతో వ్యవసాయాన్ని ఆధునిక విధానాలతో కొనసాగించాలని, వ్యయం తగ్గుతుందని, నాణ్యతగా ఉంటుందని, దిగుబడులు పెరిగేందుకు అవకాశం కలుగుతుందని ఆయన వివరించారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మకూరులో విద్యుత్ ప్రత్యేక లోక్ అదాలత్ నేడే

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులో మంగళవారం (ఈనెల22) ఉదయం 11.30గంటలకు ప్రత్యేకంగా విద్యుత్‌లోక్‌అదాలత్ నిర్వహిస్తామని స్థానిక విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఐ.శ్రీనివాసులు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారం కోసం ఈ లోక్‌అదాలత్ ఏర్పాటు చేసైత్తున్నామని, ఎల్‌ఆర్‌పల్లిలోని తమ కార్యాలయంలో ఉదయం 11.30గంటలనుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ లోక్‌అదాలత్‌లో చైర్‌పర్సన్ వి.శ్రీనివాస ఆంజనేయమూర్తి (రిటైర్డ్‌జడ్జి), ఆర్థిక సభ్యులు కె.రామ్మోహన్‌రావు, సాంకేతికసభ్యులు ఎన్.ఎల్.అంజనీకుమార్, స్వతంత్ర సభ్యులు డబ్ల్యు విజయలక్ష్మి పాల్గొంటారని ఆయన తెలిపారు. ఆత్మకూరు, ఉదయగిరి, కలిగిరి సబ్‌డివిజన్ పరిధిలోని అన్ని సెక్షన్లకు సంబంధించి ఈ అటక్‌అదాలత్ ఏర్పాటు చేశామన్నారు. ఈపరిధిలోని విద్యుత్ అధికారులు, సిబ్బంది హాజరవుతారని ఆయన పేర్కొన్నారు. వినియోగదారులు ఏదేని విద్యుత్ సమస్యలు పరిష్కారానికి నోచుకొనకుండా ఉంటే ఈ లోక్‌అదాలత్‌లో రాతపూర్వకంగా పిర్యాదుచేసి సమస్యలను పరిష్కరించుకోవాలని శ్రీనివాసులు కోరారు. ఈఅవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## సంతోష్‌కుమార్‌కు స్మార్ట్‌శిరోమణి పురస్కారం




**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణానికి చెందిన మేళ్ళచెరువు సంతోష్ కుమార్‌స్వామికి స్మార్ట్‌శిరోమణి అవార్డు లభించింది. సింహాచలంకు చెందిన ఎన్‌ఎస్‌లైవ్ ఆస్ట్రోప్రవేట్ లిమిటెడ్ ఆర్యన్ అస్ట్రోలజీ రీసెర్చ్‌సెంటర్ వారు ఆయనకు కేంద్ర మాజీ పౌరవిమానయాన శాఖామంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు, విశాఖపట్టణం ఆర్‌ఎస్‌ఎస్ సంఘసంచాలక్ టి.వి.రమణ చేతులమీదుగా స్మార్ట్‌శిరోమణి అవార్డు ప్రదానంచేసి అత్యంత ఘనంగా సత్కరించి గౌరవపురస్వారాన్ని అందజేశారు. స్థానిక శివాలయం ప్రధానఅర్చకులు మేళ్ళచెరువు శివకుమార్‌శర్మ కుమారుడైన యువ పురోహితుడు సంతోష్‌కుమార్ స్వామి ఉన్నత సాంకేతికవిద్య పొందడంతోపాటు పౌరోహిత్యంలో పట్టుసాధించి కొనసాగుతున్నారు. ఆయన సేవలను గుర్తించిన ఆర్యన్‌అస్ట్రోలజీరీజెర్చ్‌సెంటర్ వారు సంతోష్‌కుమార్‌స్వామికి స్మార్ట్‌శిరోమణి అవార్డుతో పురస్కారం అందజేసి ఘనంగా సన్మానించారు. ఆయన అవార్డు పొందడంపట్ల ఆత్మకూరు ప్రాంత అర్చకులు, వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు అభినందనలు తెలిపి భవిష్యత్తులో మరిన్ని పురస్కారాలు పొందాలని ఆకాంక్షించారు.

# 5వ డివిజన్‌లో పార్టీని పటిష్టం చేయండి : ఎమ్మెల్సీ పర్వత రెడ్డి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలోని 5వ డివిజన్‌లో పార్టీని పటిష్టం చేసేందుకు కలిసికట్టుగా పనిచేయాలని నెల్లూరు సిటీ వైసిపి ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి సూచించారు. సోమవారం సత్యనారాయణపురంలో వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సానా సుబ్బారెడ్డిని 5వ డివిజన్ వైసిపి ఇన్‌చార్జ్, అధ్యక్షుడు ఇబ్రహీంను కోఆర్డినేటర్‌గా ప్రకటించారు. ఈ సందర్భంగా పలువురు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మాట్లాడుతూ.. డివిజన్‌లో పార్టీ బలోపేతం దిశగా తామంతా కలిసికట్టుగా ఏకతాటిపై పనిచేస్తామని తెలియజేశారు. అనంతరం పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. మంచి చేసే జగన్మోహన్‌రెడ్డి లాంటి ముఖ్యమంత్రిని ఎందుకు వదులుకున్నామని ఈరోజు ప్రతి ఒక్కరూ బాధపడుతున్నారని తెలిపారు. ప్రజలకు మంచి చేయాలనే ఆలోచన ఉన్న కమిట్మెంట్ కలిగిన లీడర్ జగన్మోహన్ రెడ్డిని అన్నారు. పార్టీకి కష్టకాలంలో సేవలందించిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరికి జగన్మోహన్ రెడ్డి అండగా ఉంటారని తెలిపారు. డివిజన్ ప్రజలతో చర్చించి సుబ్బారెడ్డిని 5వ డివిజన్ ఇన్‌చార్జ్‌గా కోఆర్డినేటర్‌గా ఇబ్రహీంను ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. వారికి సహకరిస్తూ డివిజన్‌లో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి మళ్లీ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చే విధంగా కృషి చేయాలన్నారు.

# సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర చాలా విలువైనది



## ఎంఈఓ బండి గోవిందయ్య

**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి రూరల్ మండలం వెంకటేశ్వరపురంలో సోమవారం పదవి విరమణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కావలి మండల విద్యాశాఖ అధికారి బండి గోవిందయ్య పాల్గొన్నారు. అనంతరం అక్కడ జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర చాలా విలువైనదని వారు తెలిపారు. పాఠశాలలో విద్య నేర్చుకున్న విద్యార్థులు గురువుల పట్ల అంకితభావంతో ఉండాలని నేటి బాలలే రేపటి పౌరులని చదువు విద్యార్థులకి కిరీటం లాంటిదని అలాగే విద్య లేనివాడు వింత పశువు అని కూడా ఒక సామెత ఉందని. ఈ సందర్భంగా తెలిపారు. ప్రపంచంలో దొంగిలించలేనిది ఒక విద్య మాత్రమేనని, విద్య ఎంత ఉన్నత స్థితికి తీసుకెళ్తుంది అంటే దేశాన్ని పరిపాలించే నాయకుని వరకు విద్య నేర్చుకుని తమ తెలివితేటలతోనూ గురువులు చెప్పిన పాఠాలు నేర్చుకొని ఉన్నతస్థానంలో ఈరోజు ప్రపంచ యావత్తు కూడా విద్య అనేది ఎంతో అవసరమని విద్య ప్రతి విద్యార్థి శ్రద్ధతో నేర్చుకొని చదువుకున్న పాఠశాలకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని తెలిపారు. అలాగే వేసవిలో కొత్తగా విద్యార్థులు చేర్చుకునేందుకు ఉపాధ్యాయులు కూడా సమ్మర్ డేస్ విద్యార్థులను చేర్చుకునేందుకు కష్టపడి ప్రతి గృహం తిరిగి విద్యార్థులను గుర్తించి పాఠశాలలో చేర్చుకునేందుకు తల్లిదండ్రులను మోటివేట్ చేయాలని వారు తెలిపారు. ఈరోజు కొంత మంది నూతనంగా ఒకటవ తరగతిలో ఎంఈఓ ఆధ్వర్యంలో చేరడం జరిగింది. ఈ కార్యక్రమంలో అన్నగారిపాలెం పంచాయితీలో ఉన్న ప్రతి ఉపాధ్యాయుడు, ఉపాధ్యాయిని, టిసి పాలెం, సంబంధించిన విద్యార్థినుల తల్లిదండ్రులు హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

# వచ్చేనెల 10 నుండి మా రాముడు అందరివాడు సినిమా మొదటి షెడ్యూల్

**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** వచ్చేనెల 10 నుంచి మా రాముడు అందరివాడు సినిమా మొదటి షెడ్యూల్ నిర్వహిస్తున్నట్లు ఆ సినిమా నిర్వహకులు తెలిపారు. నెల్లూరు నగరంలోని స్థానిక అభిరామ్ హోటల్ నందు జరిగిన విలేకరుల సమావేశంలో మా రాముడు అందరివాడు చిత్రం హీరో, తన తొమ్మిదవ సినిమాలో హీరోగా నటిస్తున్న యువ నటుడు శ్రీరామ్ మాట్లాడుతూ.. ఈనెల 19, 20, 21 తేదీలలో ఆడిషన్స్ నిర్వహించామని సినిమా నందు ఎక్కువ మంది నటీనటులు అవసరం ఉన్నందువల్ల 26వ తేదీ తిరుపతి నందు 27వ తేదీ నెల్లూరు అభిరామి హోటల్ నందు ఆడిషన్స్ నిర్వహిస్తున్నామని తెలియజేశారు. నటీనటులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. అలాగే మే 10వ తేదీ నుండి మా రాముడు అందరివాడు సినిమా మొదటి షెడ్యూల్ షూటింగ్ నెల్లూరు జిల్లాలో ప్రారంభిస్తున్నట్లు తెలియజేశారు. ఈ చిత్రానికి దర్శకుడు మైకేల్, నిర్మాత ప్రవీణ్ వర్మ, సంగీతం వాసు, అసిస్టెంట్ డైరెక్టర్‌గా రవీందర్ రెడ్డి, ప్రొడక్షన్ మేనేజర్‌గా రాహుల్ యాదవ్ వ్యవహరిస్తున్నట్లు తెలియజేశారు.

# పొలాల దారిని కబ్జాచేసే యత్నం

## అడ్డుకున్న గ్రామస్థులు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలం గొల్లపల్లి వద్ద బొగ్గేరుగట్టున గ్రామస్థులు పొలాలకు వెళ్ళేదారిని కొందరు కబ్జాచేసేందుకు సోమవారం యత్నించగా గ్రామస్థులు అడుకున్న సంఘటన జరిగింది. ఈదారిని ఆక్రమించుకునేందుకు కన్నేసిన కొందరు జెసిబితో పనులు ప్రారంభించారు. దాంతో గ్రామస్థులు వచ్చి అడ్డుకొనగా వాగ్వివాదం జరగగా ఘర్షణవాతావరణం, ఉద్రిక్తపరిస్థితి ఏర్పాడింది. దాదాపు 100ఎకరాలకు ఈమార్గాన అనాదిగా తాము రాకపోకలు సాగిస్తున్నామని, ఈ దారిని ఆక్రమించుకునేందుకు యత్నించడం దారుణంగా ఉందని గ్రామస్థులు పేర్కొంటూ ఏమాత్రం పనులు ముందుకు సాగకుండా అడ్డుకున్నారు. చేసేదిలేక ఆ జెసిబి డ్రైవర్ అక్కడనుండి వాహనంతోసహా జారుకున్నాడు. కబ్జారాయుళ్ళనుండి తాము పొలాలకు వెళ్ళే రహదారిని కాపాడాలని, ప్రజాప్రతినిధులు, అధికారులు పరిశీలించి తమ పొలాలకు వెళ్ళే రహదారి కబ్జా కాకుండేలా కాపాడాలని, తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

# దాతల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు



**బోగోలు, మేజర్‌న్యూస్ :** బోగోలు మండలం జువ్వలదిన్నె గ్రామ సెంటర్‌లో దాతల సహకారంతో మూడు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్టు బిట్రగుంట ఎస్.బోజ్య నాయక్ తెలిపారు. సీసీ కెమెరాలను అవంతిక కంపెనీ వారి సహకారంతో, గునిమిని సుబ్బారెడ్డి ఆ సెంటర్ వద్ద ఉన్న దుకాణ యజమానుల సహకారంతో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బిట్రగుంట ఎస్ఐ మాట్లాడుతూ.. నేర నియంత్రణలో సీసీ కెమెరాల ఉపయోగం అన్నారు. నేరాలను మండల ప్రజలు తమ తమ గ్రామాలలోనీ ప్రధాన కూడలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో చేరికలు పెంచేందుకు యూటీఎఫ్ ప్రచారం



**చేజర్ల, మేజర్‌న్యూస్ :** యూటీఎఫ్ ఆధ్వర్యంలో చేజర్ల మండలంలోని చిత్తలూరు, ఆదురుపల్లి గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేర్పింపునకు ఉపాధ్యాయులు భారీగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని తల్లిదండ్రులతో సమావేశమై పాఠశాలల్లో అందుబాటులో ఉన్న నాణ్యమైన సదుపాయాలను వివరించారు. ప్రభుత్వం ప్రతి 45 మంది విద్యార్థులకు నలుగురు ఉపాధ్యాయులను, 60 మంది విద్యార్థులు ఉన్నచోట ఐదుగురు ఉపాధ్యాయులను నియమించడం, తరగతి కోసమే ఒక ఉపాధ్యాయుడిని ఏర్పాటు చేయడం, అలాగే ప్రతి గ్రామ పంచాయతీలో ఆదర్శ పాఠశాలల స్థాపన వంటివి విద్యారంగానికి గణనీయమైన పురోగతిగా పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ కరపత్రాలను పంచారు. కార్యక్రమంలో యుటిఎఫ్ బృందంతోపాటు పలువురు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. పిల్లల భవిష్యత్తు దృష్ట్యా ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న నాణ్యమైన విద్యను వినియోగించుకోవాలని తల్లిదండ్రులను కోరారు.

# రైతులకు భూసార పరీక్షలపై అవగాహన : ఏఓ శిరీష రాణి



**తోటపల్లి గూడూరు, మేజర్‌న్యూస్ :** తోటపల్లి గూడూరు మండలంలోని టిపి గూడూరు బిట్ వన్, మాచర్లవారిపాలెం గ్రామాలలో భూసార పరీక్షలపై, రబీ ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన సదస్సు, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 2024-25 సంవత్సరంలో తీసిన భూసార పరీక్ష పత్రాలను రైతులకు అందజేశారు. భూసార పరీక్షలు చేయడం ద్వారా నేలలోని పోషక విలువలు తెలియడం వలన అధికంగా రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించవచ్చని రైతులకు అవగాహన కల్పించారు. ప్రత్యామ్నాయ పంటలుగా కూరగాయల సాగు ప్రోత్సహించాలని తెలిపారు. వరి మాగాణి పొలాలలో మినుము పెసర చల్లుకోవాలని తద్వారా రైతు ఆదాయం పొందాలని నేలను సారవంతం చేసుకోవచ్చని నేలలో నత్రజని శాతాన్ని పెంచుకోవచ్చని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శిరీష రాణి గ్రామ వ్యవసాయ సహాయకులు వినీల్ విద్యాసాగర్ రైతులు పాల్గొన్నారు.



# కమ్ముకుంటున్న కరువు ఛాయలు

- కరుణించని వరుణుడు
- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- మే నెలలో త్రాగునీరు గగనమే
- నిలువునా ఎండుతున్న పంటలు
- మెట్ట ప్రాంతంలో విపత్తు పరిస్థితి
- వలసలు తప్పదంటున్న ప్రజలు, అన్నదాతలు

**మెట్ట ప్రాంతంలో కరువు ఛాయలు అలుముకుంటున్నాయి. రోజు రోజుకి భానుడి ప్రతాపం విజృంభిస్తుండడంతో మెట్ట ప్రాంత వాసులు తలడిల్లిపోతున్నారు. వరుణుడు కూడా కరుణించకపోవడంతో త్రాగునీటికి కూడా మే నెలలో గగనమయ్యే పరిస్థితి నెలకొననున్నది. ఇక పంటల పరిస్థితి సాగునీరు అండగా నిలువునా ఎండిపోతున్నాయి. దీంతో మెట్ట ప్రాంత ప్రజలు, అన్నదాతలు వలసలు తప్పవని వారి ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. వివరాల్లోకి వెళితే..**

**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మెట్ట ప్రాంతాలైన ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లో ప్రస్తుత ఏడాది కరువు ఛాయలు అలుముకుంటున్నాయి. రాష్ట్రంలో దాదాపుగా అన్ని జిల్లాల్లో తుఫాన్లు వచ్చి పోరాటం ఇచ్చాయి. కానీ జిల్లాలోని మెట్ట ప్రాంతంలో ఆ వర్షపు జాడే లేకపోవడంతో కనీసం చెరువులు కూడా నిండని పరిస్థితి ఏర్పడడంతో ఈ దుస్థితి నెలకొందని ప్రజలు వాపోతున్నారు. ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల పరిధిలోని సీతారామపురం, ఉదయగిరి, వరికుంటపాడు, దుత్తలూరు, వింజమూరు, మర్రిపాడు, అనంతసాగరం, చేజర్ల, ఏఎస్ పేట, ఆత్మకూరు తదితర మండలాల్లో ఎటు చూసినా కనీసం చుక్క నీరు కనిపించక పోవడంతో మెట్ట ప్రాంత వాసులకు త్రాగునీరు కూడా గగనం అయ్యే పరిస్థితి ఏర్పడనుంది. ప్రస్తుతం ఆ త్రాగు నీటిని కొనుగోలు చేసి తాగాల్సిన పరిస్థితి ఏర్పడిందని మండల ప్రజలు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. ఇక పంటల విషయానికి వస్తే సాగు చేసిన పంటలకు కనీసం తడిని కూడా అందించలేని పరిస్థితి నెలకొందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. దీంతోపాటుగా కిలోమీటర్ల కొద్ది భగీరథ ప్రయత్నాలు చేసి పంటలకు సాగునీరు అందించినప్పటికీ గిట్టుబాటు ధరలు లేక తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం ఆ వ్యవసాయ బోర్లకు కూడా నీరు సమృద్ధిగా రావడం లేదని రైతులు పెదవి విరుస్తున్నారు. వర్షాధారం లేకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటాయని ఫలితంగా వ్యవసాయ బోర్లకు నీరు అందడం గగనం అయిందని వాపోతున్నారు. మెట్ట ప్రాంతంలో కనీసం 300 అడుగులకు పైగా బోర్ పాయింట్లు వేసినప్పటికీ నీరు లభించడం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు.

### అకాల వర్షాలపై ఆశ..



మెట్ట ప్రాంత రైతాంగానికి ప్రజలకు ప్రస్తుత ఏడాది అకాల వర్షాలు పైనే ఆధారపడి ఉన్నారు. ఇప్పటికీ మూడు రకాలు జిల్లాలో అకాల వర్షాలు కురిసినప్పటికీ మెట్ట ప్రాంతాన్ని మాత్రం తాకక పోవడంతో ఉష్ణోగ్రత తీవ్రతలు కూడా విపరీతంగా పెరిగాయి. దీంతో నివాసాల్లోని బోర్లకు నీరు రావడం కూడా తగ్గుముఖం పట్టింది. అది కూడా రెండు రోజులకు ఒకసారి వస్తుండడంతో కాలం గడుపుతున్నారు. సాగులో ఉన్న పంటలకు కూడా అకాల వర్షాలే దిక్కని రైతులు ఆకాశం వైపు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే మిరప పొగాకు తదితర పంటలను సాగు నీరు అందించలేక వదిలేసిన పరిస్థితి నెలకొంది. ఇకపోతే మిరప పొగాకు పంటలకు గిట్టుబాటు ధరలు కూడా లభించకపోవడంతో రెట్టింపు పెట్టుబడులు పెట్టిన రైతాంగం తీవ్రంగా నష్టపోక తప్పడం లేదు. ఫలితంగా మెట్ట ప్రాంత ప్రజలు అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. మరి కొంతమంది ఈ అవస్థలు భరించలేక వలసలు బాట పట్టణంలో విశ్వసనీయ సమాచారం అందుతుంది. ఇప్పటికే ఈ ప్రాంతాల్లో ఎన్నో సంవత్సరాల నుంచి సాగు త్రాగునీరు అందించకపోవడంతో ఏర్పడుతున్న ప్రభుత్వాలపై మండిపాటు పడుతున్నారు. ఏ ప్రభుత్వాలు మారిన పాలకులు వచ్చిన మెట్ట ప్రాంతాలయిన ఆత్మకూరు ఉదయగిరి నియోజకవర్గాల్లోని మండలాలకు సాగు త్రాగునీరు అందించిన దాఖలాలు లేవని ఆ ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తగు చర్యలు తీసుకొని మెట్ట ప్రాంత ప్రజలను అన్నదాతలను కాపాడే విధంగా సాగు త్రాగునీరు అందించి వలసల నివారణ తగ్గించాల్సిందిగా పలువురు కోరుతున్నారు.

---

## పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించిన ఇన్‌చార్జ్ కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ ఇంచార్జ్ కమిషనర్ వై.ఓ. నందన్ పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా సోమవారం స్థానిక 53, 54 వ డివిజన్లు రైల్వే వీధి, భగత్ సింగ్ కాలనీ, ఇస్లామ్ పేట,ఆలీ వీధి,జనార్దన్ రెడ్డి కాలనీ, వెంకటేశ్వరపురం తదితర ప్రాంతంలో పర్యటించారు. రోడ్లపై నిరుపయోగంగా విద్యుత్ స్థంభాలను సంభంధిత విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చి తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోడ్ల వెంబడి ఉన్న పిచ్చి మొక్కలు, ముళ్ళపొదలు, ఇతర వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించేలా పారిశుద్ధ్య విభాగం సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డ్రైను కాలువల పూడికతీత, సిల్ట్ ఎత్తివేత క్రమం తప్పకుండా జరపాలని సూచించారు. భవన నిర్మాణ సామాగ్రి రోడ్లను ఆక్రమించకుండా వార్డు సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. భవన నిర్మాణ సామాగ్రి వీధులకు అంతరాయం కల్పిస్తూ ఉంటే వారి నుంచి జరిమానా వసూలు చేయాలని సూచించారు. నెల్లూరు నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం అనుమతుల ప్రకారం మాత్రమే కట్టుబడి జరిగేలా పర్యవేక్షించాలని అనుమతులు లేని అదనపు నిర్మాణాలు జరుగుతుంటే, ఆయా నిర్మాణాలను వెంటనే ఆపివేయాలని ఇన్‌చార్జ్ కమిషనర్ ఆదేశించారు. అనంతరం స్థానిక తడికల బజారు కూడలిలోని అన్న క్యాంటీన్‌ను ఇన్‌చార్జ్ కమిషనర్ సందర్శించి ప్రజలకు అందుతున్న ఆహార నాణ్యతను పరిశీలించారు. నిర్దేశించిన ప్రమాణాలను తప్పనిసరిగా క్యాంటిన్‌లో పాటించేలా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

## పారిశుద్ధ్య లోపం.. పంచాయితీ అభివృద్ధికి శాపం

### తాగునీటి బోరు వద్ద నిల్వ ఉన్న మురుగునీరు

**సైదాపురం, మేజర్‌మ్యాన్ :** సైదాపురం మండలంలోని గుళించెర్ల పంచాయతీ పరిధిలో పారిశుధ్య పనులు చేయకపోవడంతో ఎటువైపు చూసిన కాలువలో మురుగునీరు నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. పంచాయతీ మోటార్ పాయింట్ వద్ద పరిస్థితి మరింత తీవ్రంగా ఉంది. కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోయి మురుగు నీటి వల్ల దోమల వ్యాప్తి పెరుగుతోంది. సీసీ రోడ్లపై నీరు నిలిచిపోయి పాచి పట్టి దుర్వాసన వెదజల్లుతోంది. మంచి నీరు బోరు పాయింట్ వద్ద మురుగు నీటి నిల్వ మూడు



రోడ్ల కూడలి వద్ద నీరు నిలువున్న చోట పంచాయతీ అధికారులు బీజింగ్ చేసే పరిస్థితి కూడా లేదని కాలినడకన పోయేటువంటి వారు వాహనదారులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులు అప్రమత్తం కాకపోవడం గమనార్హం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పంచాయతీలో పారిశుధ్య పనులు చేయించడంతోపాటు బడి ఆవరణలో కూడా క్లీన్ చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### రాములోరి కళ్యాణోత్సవంలో..

## ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



**ఇందుకూరుపేట, మేజర్‌న్యూస్ :** ఇందుకూరుపేట మండలం రాముడు పాళెం గ్రామ పరిధిలోని ఎర్రంకి దిబ్బ రామాలయంలో శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కళ్యాణోత్సవం సందర్భంగా ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యేని ఆలయ అర్చకులు పూర్ణ కుంభంతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి భక్తి శ్రద్ధలతో స్వామివారి దర్శనం చేసుకొని తీర్థ. ప్రసాదాలు స్వీకరించారు. వేద పండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా జరిగిన శ్రీ సీతారాముల వారి కళ్యాణోత్సవాన్ని భక్తులతో కలిసి తిలకించారు. తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబించేలా నిర్వహించిన సీతారాముల కళ్యాణోత్సవంలో టిడిపి నాయకులు దువ్వూరు కళ్యాణ్ రెడ్డి, కోడూరు కమలాకర్ రెడ్డి, చెంచు కిషోర్ యాదవ్‌లతో పాటు స్థానిక టిడిపి నాయకులు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

### నెల్లూరులో 'శక్తి' యాప్‌పై అవగాహన

**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం గొలగమూడిలోని ఎంజేపీ ఏపీ బీసీ గురుకుల పాఠశాలలో 'శక్తి' యాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళల భద్రత కోసం ఈ యాప్ కీలకమని, ప్రతి మహిళా మొబైల్‌లో శక్తి యాప్ ఉండాలని రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు సూచించారు. విద్యార్థినిలకు మంచిస్పర్శ.. చెడుస్పర్శ, బాల్యవివాహాలు, పాక్సో చట్టం, డయల్ 100, 112 వంటి అత్యవసర నంబర్లపై వివరించారు. కార్యక్రమంలో శక్తి టీమ్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.